# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర వ్యాప్తంగా 21 ప్రధాన ఆలయాలకు ఛైర్మన్ల నియామకం చేపడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట నారాయణ భట్టి తెలిపారు.
- ❖ రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలను త్వరలో పూర్తి చేస్తామని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.
- ❖ అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.
- ❖ హోలీ పండుగ మనుషులలో ఐక్యతను చాటి చెబుతుందని కేంద్ర న్యాయ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ పేర్కొన్నారు.

=======================

నామినేటెడ్ పదవుల భర్తీకి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగు దేశం పార్టీకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి శ్రవణమాధ్యమ సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 21 ప్రధాన ఆలయాలకు ఛైర్మన్ల నియామకం చేపడతామని తెలిపారు. నామినేటెడ్ పదవుల కోసం 60 వేల దరఖాస్తులు వచ్చాయని, సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తామని అన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందచేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

=======================

రానున్న రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అన్ని వైద్య కళాశాలలను పూర్తి చేస్తామని ఆరోగ్య కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిలో కోటి

రూపాయలతో ఏర్పాటు చేసిన డయాల్సిస్ కేంద్రాన్ని ఈ రోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాలకొల్లుతో పాటు అన్ని జిల్లాల్లో వైద్య కళాశాలలను పూర్తి చేస్తామన్నారు. రానున్న రెండు నెలల్లో 5 ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట నారాయణ భట్టి తెలిపారు. చట్టం, మహిళా సాధికారిత అంశంపై తిరుపతి స్విమ్స్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత సాధించడానికి రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు అందించిందని ఆయన పేర్కొన్నారు. సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు రాష్ట్రాలకు అధికారం ఇచ్చిందని తెలిపారు. లింగ బేధం లేకుండా మహిళలు స్వతంత్రంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించినప్పటికీ అవగాహన లోపం వల్ల చాలా మంది మహిళలు ఆ హక్కులను వినియోగించుకోలేకపోతున్నారని అన్నారు. అన్ని రంగాల్లో మహిళా భాగస్వామ్యం చేస్తే  మంచి ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

======================

మంగళగిరిలో అభివృద్ధి కార్యక్రమాలను రానున్న వంద రోజుల్లో ప్రారంభించనున్నామని విద్యా శాఖ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గుంటూరు జిల్లా ఎర్రబాలెంలో జైనుల ఆధ్వర్యంలో నిర్మించిన భగవాన్ మహవీర్ గోశాలను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ, నడుమూరు ఫ్లైఓవర్ పనులు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. హోలీ సందర్భంగా చిన్నారులకు లోకేశ్ రంగులు పూశారు. అనంతరం రమేశ్ జైన్ ఆధ్వర్యంలో నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్‌ను మార్వాడీలు ఘనంగా సన్మానించారు.

======================

ప్రపంచ స్థాయి రాజధాని నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. అమరావతి నగర నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సిఆర్ డిఏ సమావేశంలో 37 వేల 702 కోట్ల రూపాయల విలువైన 59 అభివృద్ధి టెండర్లను ఆమోదించిందని పేర్కొన్నారు. క్యాబినెట్ ఆమోదం తర్వాత ప్రాజెక్టులు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే నెలలో ప్రారంభమయ్యే ఈ నిర్మాణ కార్యక్రమాలలో దాదాపు 20 వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అన్నారు. మొత్తం రాజధాని నగర అభివృద్ధి వ్యయం 64 వేల కోట్ల రూపాయలుగా అంచనా వేశామని, పన్ను చెల్లింపుదారులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధుల్ని సమకూర్చుకుంటోందని పేర్కొన్నారు.

విరామం

======================

అమరావతి నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని ఈరోజు మంత్రి దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, ఆలయ పవిత్రతను కాపాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయం మేరకు అమరావతి నిర్మాణం కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

(వాయిస్ 25 సెకన్లు)

======================

కర్నూలు జిల్లా పత్తికొండ మండలం కనకదిన్నె గ్రామం వద్ద 11 కోట్ల రూపాయలతో నిర్మించనున్న టమోటా ప్రాసెసింగ్ ప్లాంట్ కు పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, పార్లమెంట్ సభ్యులు నాగరాజు, శాసనసభ్యులు కెఇ శ్యాంబాబు ఈరోజు భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... టమోటా ఎక్కువగా పండిస్తున్న ఈ ప్రాంతంలో రైతులు నష్టపోకుండా ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే, కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మరిన్ని ప్రాజెక్టులు స్థాపించి ఉపాధిని కల్పిస్తామని పేర్కొన్నారు.

======================

జన'సేవా' నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా కొనసాగుతోన్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగు దేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ అధినేత కె. పవణ్ కల్యాణ్ పార్టీ ముఖ్య నాయకులకు, జనసైనికులకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలియజేశారు. కాగా కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని చిత్రాడలో ఏర్పాటు చేసిన జనసేన ఆవిర్భావ సభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలివస్తున్నారు.

======================

రాష్ట్ర వ్యాప్తంగా హోలీ పండుగను ప్రజలు ఈరోజు జరుపుకుంటున్నారు. హోలీ పండుగ మనుషులలో ఐక్యతను చాటి చెబుతుందని కేంద్ర న్యాయ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ అన్నారు. విజయవాడ లో ఈ రోజు జరిగిన హోలీ పండుగ కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ. డి.పురంధేశ్వరితో ఆయన కలిసి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ, హోలీ స్నేహం, ప్రేమ, ఆనందం పంచుకునే పండుగ అన్నారు. ఈ పండుగ కేవలం రంగుల వేడుక మాత్రమే కాదని, ఐక్యత, భక్తి, ఆనందం కలిసికట్టుగా ఉండే భావనలకు ప్రతీక అని పేర్కొన్నారు.

======================

మానవతావాది, ప్రపంచ మేధావి డాక్టర్ బి. ఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఈ రోజు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరికం లేని సమాజానికి కృషి చేస్తున్నాయన్నారు.

======================

పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈరోజు సాయంత్రం గరుడసేవ నిర్వహించనుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఒక ప్రకటనలో తెలిపింది. ఈరోజు రాత్రి 7 నుండి 9 గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

======================

విశాఖపట్నం జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రంలో ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి పెళ్లి చూపుల ఉత్సవం, డోలోత్సవం సంప్రదాయ బద్ధంగా జరిగాయని ఆలయ అధికారులు తెలియజేశారు. అర్చకులు స్వామి, అమ్మవార్లను సింహగిరిపై నుంచి మెట్ల మార్గంలో కొండ దిగువకు తీసుకువచ్చి పుష్కరిణి ఉద్యాన మండపంలో దేవతామూర్తులను ఉయ్యాలలో అధిష్ఠించి చూర్ణోత్సవం, వసంతోత్సవం, ఉయ్యాల సేవలు నిర్వహించారని తెలిపారు. అప్పన్న స్వామి సోదరి, పైడితల్లి అమ్మవారి కుమార్తెతో స్వామికి పెళ్లి కుదిరిన సందర్భంగా అర్చకులు, గ్రామస్థులు ఆనందోత్సాహాల నడుమ రంగులు చల్లుకొని వేడుకలు నిర్వహించారు. ఏప్రిల్ 8న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ

నరసింహ స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవం సందర్భంగా రథోత్సవంకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

=======================

=======================